ప్రజాశక్తి
ఆదివారం 18 ఆగస్టు 2024 5
శ్రీ సత్యసాయి

బదిలీలకు గ్రీన్ సిగ్నల్

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. పలు మండలాల్లో మోస్తరు నుంచి అతి మోస్తారు వర్షాలు కురిశాయి. వర్షం రాకతో వాగులు, వంకలకు జలకళ సంతరించుకుంది. కొత్తచెరువు మండలంలో వంగపేరు నది ఉధృతంగా ప్రవహించాయి. దీంతో పుట్టపర్తి నుంచి ధర్మవరం, అనంతపురానికి రాకపోకలు నిలిచిపోయాయి. చిత్రవతి నీటితో పరవళ్లు తొక్కింది. నల్లచెరువు మండల పరిధిలోని పాయలవడ్లపల్లి గ్రామంలో ఓ ఇంటిపై పిడుగు పడింది.

ప్రజాశక్తి-జిల్లా యంత్రాంగం

ధర్మవరం మండలం పోతులనాగేపల్లి వద్ద ప్రవహిస్తున్న చిత్రావతి నది

జోరుగా వర్షం..!

◆ పలు మండలాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం ◆ చెరువులు, వాగులకు జలకళ

మరువ పారుతున్న పుట్టపర్తి మండలం గాజులపల్లి చెరువు

ఉధృతంగా ప్రవహించిన వంగపేరు నది..

కొత్తచెరువు : శుక్రవారం రాత్రి కురిసిన మండల పరిధిలోని సత్యసాయి వాటర్ సప్లయ్ పంపు వద్ద వంగ పేరు నది ఉధతంగా ప్రవహించింది. రెండు గంటల పాటు ప్రధాన రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర ఆ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. మధ్యాహ్నం నది ఉధతి తగ్గిన తర్వాత రాకపోకలు కొనసాగాయి. నీటి ఉధృతి తగ్గేంత వరకు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది నదిని దాటడానికి ఎవరినీ అనుమతించలేదు. కొత్తచెరువు నుంచి పెనుగొండకు వెళ్లే రహదారిలో, రైల్వే బ్రిడ్జి వద్ద నీరు చేరడంతో రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెనుగొండకు వెళ్లే వాహనాలన్నింటినీ మామిళ్లకుంట క్రాస్, జగరాజు పల్లి మీదుగా పెనుగొండ వైపు మళ్లించారు. పుట్టపర్తి నుంచి అనంతపురానికి వెళ్లే వాహనాలను జగరాజుపల్లి, పెనుగొండ మీదుగా అనంతపురం వైపు మళ్లించారు. కొత్తచెరువులో 78.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది.

జిల్లాలో 29 మండలాల్లో వర్షం..

పుట్టపర్తి అర్బన్: జిల్లావ్యాప్తంగా మూడు మండలాలు మినహా మిగిలిన 29 మండలాల్లో శుక్రవారం రాత్రి వర్షాలు పడ్డాయి. రాత్రి 12 గంటలపైన కొన్ని మండలాల్లో మూడు గంటల పాటు ఏకదాటిగా వర్షం కురిసింది. అత్యధికంగా అమరాపురం మండలంలో 98.2 మిల్లీమీటర్లు, గోరంట్ల 95.4, మడకశిరలో 88.4, చెన్నేకొత్తపల్లి 86.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. మిగతా మండలాల్లో ఒక మోస్తారు వర్షాలు కురిసాయి.

చిలమత్తూరు పెద్దకాలువకు గండిపడి వృథాగా పోతున్న నీరు

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి, పెనుగొండ మండలాల్లో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఒక్కరాత్రిలోనే గాజులపల్లి చెరువు నిండింది. వంగపేరు నది ఉధతంగా ప్రవహించడంతో కొట్లపల్లి వద్ద పెనుగొండ- పెడపల్లి ప్రధాన రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నది ప్రవహించడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఆ దారి గుండా ప్రయాణం చేసేందుకు వీలుకాలేదు. గాజులపల్లి చెరువు నిండడంతో కొట్లపల్లి, నిడిమామిడి, ఇరగ రాజు పల్లి, పంచాయతీల పరిధిలోని బోరుబావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ధర్మవరం మండలంలో భారీ వర్షం

ధర్మవరం రూరల్ : మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 10 గంటల నుంచి శనివారం తెల్లవారు జాము 5గంటల వరకు ఎడతెరిపిలేకుండా వర్షం పడింది. ఎగువన కూడా పెద్ద వర్షాలు రావడంతో చిత్రావతి నది మండల పరిధిలోని పోతులనాగేపల్లి వద్ద ఉధృతంగా ప్రవహించింది. చిత్రావతి నుంచి ధర్మవరం చెరువుకు నీరు చేరాయి. మండలంలో కునుతూరు వంక కూడా వర్షం నీటితో పొంగింది. దీని నుంచి గొట్లూరు చెరువుకు కూడా నీరు చేరుకున్నాయి. రాత్రి కురిసిన భారీ వర్షాలతో ప్రజలు, రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఎడతెరిపి లేని వర్షంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

చిలమత్తూరు పెద్దకాలువకు గండి

చిలమత్తూరు : మండల పరిధిలోని చిలమత్తూరు పెద్దచెరువు, మరవకొత్తపల్లి ఈదులవంకకు ప్రాణాధారంగా ఉన్న పెద్దకాలువ లాలేపల్లి పాకతోట వద్ద గండి పడింది. దీంతో నీరు మొత్తం వథాగా కుషావతిలో కలిసింది. శుక్రవారం రాత్రి ఎగువన కురిసిన వర్షానికి పెద్ద కాలువ నుంచి భారీగా నీరు చెరువులో చేరే అవకాశం ఉండేది. కాలువకు రెండేళ్ల క్రితం గండిపడింది. అప్పుడు కంటితుడుపు చర్యగా మట్టి ఇసుక బస్తాలతో దానిని పూడ్చారు. కాలక్రమేనా అది కోతకు గురైంది. ప్రస్తుతం నీరు ప్రవహించడంతో మరోసారి గండిపడింది. గండికి శాశ్వత మరమతులు చేస్తామన్న పంచాయతీ, ఇరిగేషన్ అదికారులు తర్వత పట్టించుకోలేదు.

పాయలవడ్లపల్లిలో పిడుగుపాటు

నల్లచెరువు : మండల పరిధిలోని పాయలవడ్లపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి ఓ ఇంటిపై పిడుగు పడింది. దాసరి ఆంజనేయులు ఇంటిపై పిడుగు పడడంతో టీవీ, ఫ్రిడ్జ్, విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. రూ.60 వేల నష్టం వాటిల్లింది. పిడుగు పడిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

కొత్తచెరువు మండలం సత్యసాయి వాటర్ సప్లయ్ పంప్‌హౌస్ వద్ద రోడ్డు ప్రవహిస్తున్న వంగపేరు నది

◆ 19 నుంచి 31వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశం

◆ కోరుకున్న ప్రాంతానికి వెళ్లేందుకు అధికారుల ప్రయత్నాలు

◆ నేతల చుట్టూ ప్రదక్షిణలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ శాఖల్లో బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 19వ తేది నుంచి 31వ తేదీలోపు బదిలీలను పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ కార్యాలయాల్లో బదిలీల జాతర సాగనుంది. అన్నీ శాఖల్లోనూ ఈబదిలీలు ఉండనుండటంతో ఎవరికి వారు తాము కోరుకున్న చోటుకు చేరుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేసుకునేలో పనిలోపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, సవిల్ సప్లయ్, మైనింగ్, ఇంజినీరింగ్ శాఖలో అందరూ, దేవాదాయ, రవాణా, ఇఫ్ఎస్, పరిశ్రమ, విద్యుత్, రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ ఇలా అన్నీ కలిపి 15 శాఖల్లో ఈ బదిలీలు జరుగనున్నాయి. ఇందులో ఎక్సైజ్ శాఖలో మాత్రం సెప్టంబర్ 1వ తేదీ నుంచి బదిలీలు చేపట్టాలని నిర్ణయించింది. తక్కిన అన్ని శాఖల్లోనూ ఆగస్టు 19వ తేదీ నుంచి 31వ తేదీలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. బదిలీలకు సంబందించి చేపట్టాల్సిన మార్గదర్శకాలనూ జారీ చేసింది.

బదిలీ మార్గదర్శకాలు ఇలా..

ఐదు సంవత్సరాలు ఒకే చోటు విధులు నిర్వహించిన వారికి విధిగా బదిలీ ఉండనుంది. జీరో సర్వీసు ఉన్న వారు కూడా అభ్యర్థను పెట్టుకోవడానికి అవకాశముంది. అంగవైకల్యం కలిగిన వారు, కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా తీవ్రమైన అనారోగ్య సమస్యలున్నా, భార్యభర్తలిద్దరూ ఉద్యోగం చేస్తుంటే వారిలో దగ్గరగా ఉండే కేంద్రానికి బదిలీల్లో ప్రాధాన్యత కల్పించాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. అదే విధంగా ఐటిడిఎ ప్రాంతాల్లో రెండు సంవత్సరాలు పనిచేసిన వారికి కూడా ప్రాధాన్యత ఉండనుంది. ఉద్యోగ సంఘాల్లో పనిచేసే వారికి కూడా కొన్ని మినహాయింపులు ఇచ్చింది.

సిఫారసులకై ప్రదక్షిణలు

రాష్ట్ర ప్రభుత్వం బదిలీల ఉత్తర్వులివ్వనుందన్న విషయం తెలిసినప్పటి నుంచే ఉద్యోగులు సిఫారసులకై నేతల వద్దకు క్యూ కడుతున్నారు. అధికారికంగా ఉత్తర్వులు శనివారం వచ్చిన నేపథ్యంలో సిఫార్సులపై వారి వద్దకు పెద్దఎత్తున క్యూలు కట్టే పరిస్థితి ఉంది. జీరో సర్వీసు కూడా బదిలీలు ఉంటంతో వారందరూ తాము కోరుకున్న చోటుకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

జెడ్పీ సిఇఒగా ఓబుళమ్మ

ప్రజాశక్తి- అనంతపురం అర్బన్

ఉమ్మడి అనంతపురం జిల్లా జెడ్పీ సిఇఒగా ఓబుళమ్మ శనివారం నాడు బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి సీఈఓ, డీపీఓ ప్రభాకర్ రావు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను జెడ్పీ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.బాధ్యతలు చేపట్టిన అనంతరం సిఇఒ అనంతపురంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న సిఇఒ ఓబుళమ్మ

ఎంపీ బికె.పార్థసారధికి సన్మానం

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

హిందూపురం ఎంపీ బికె.పార్థసారథిని పెనుకొండలోని ఆయన కార్యాలయంలో విశ్వహిందూ పరిషత్ కమిటీ సభ్యులు శనివారం సత్కరించారు. పెనుకొండ ప్రఖండ అధ్యక్షులు వేద వ్యాస్ అధ్యక్షతన సన్మానించారు. రాబోయే కాలంలో బికె.పార్థసారథి పెనుకొండను పర్యాటక రంగంగా, మరిన్ని కంపెనీలు తీసుకు వచ్చి మరింత అభివృద్ధి చేయాలని కోరారు.

వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

వృద్ధి సాధించే దిశగా ప్రణాళికలు
కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో వచ్చే ఏడాదికి 15 శాతం వృద్ధి సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్లో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఈఓఆర్‌డిలతో వికసిత్ ఆంధ్ర 2024-2029 యాక్షన్ ప్లాన్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2047 నాటికి వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా జిల్లాకు సంబంధించి సమర్థవంతమైన ప్రణాళికలతో అధికారులు పనిచేయాలన్నారు. నీతి ఆయోగ్ సహాయ సహకారాలతో నిర్దేశిత లక్ష్యాలను నిర్ణయించుకుని ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. అన్ని ప్రాథమిక రంగాల్లో వంద రోజుల అభివద్ధి ప్రణాళికలు తయారు చేశామన్నారు. 2047 నాటికి పూర్తిగా అభివద్ధి చెందిన భారత్‌గా ఉండాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, పరిశ్రమల శాఖ జిఎం చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బందోబస్తు నడుమ ఎస్ఎంసి ఎన్నికలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం మలగూరు ప్రాథమిక పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలను శనివారం నాడు పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. గతంలో జరిగిన ఎన్నికల సమయంలో వైసిపి మద్దతుదారులు గెలవడంతో టిడిపి నాయకులు ఫలితాలను వెల్లడించకుండా అడ్డుపడ్డారు. ఈ సమయంలో గందరగోళం నెలకొనడంతో అధికారులు ఎన్నికలను వాయిదా వేశారు. ఈ క్రమంలో శనివారం నిర్వహించిన ఎన్నికల్లో ఛైర్మన్ అభ్యర్థికి సమాన ఓట్లు రావాడంతో బొమ్మ బొరుసు ద్వారా ఎన్నికను నిర్వహించారు. ఇందులో ఉమ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, రూరల్ సిఐ ఆంజినేయులు, పోలీసులు పాల్గొన్నారు.

మలగూరు పాఠశాలలో పోలీసుల సమక్షంలో జరుగుతున్న ఎన్నికలు

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతాం : ఎస్పీ

ప్రజాశక్తి-పెనుకొండ

జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ వి.రత్న తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్, సెబ్ స్టేషన్లో పరిధిలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడిన మద్యం, నాటు సారాను శనివారం పట్టణ సమీపంలోని రాజేశ్వరీకాలనీ వద్ద ఎస్పీ సమక్షంలో జెసిబితో ధ్వంసం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్), పోలీస్ స్టేషన్లలో అక్టోబర్ 2023 నుంచి ఆగస్టు 2024 వరకూ మద్యం అక్రమరవాణా, నాటుసారా తరలింపునకు సంబంధించి 1,417 కేసులు నమోదైయ్యాయని, సుమారు 10వేల లీటర్ల మద్యం పట్టుబడిందని, దాని విలువ రూ. 68 లక్షలని వివరించారు. జిల్లాలో నాటుసారా, మద్యం, ఇసుక, గంజాయి, పేకాట, మట్కా, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. మద్యం అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలోనే శ్రీసత్యసాయి జిల్లాలో అత్యధిక కేసులు నమోదు చేశారని, పోలీసు, సెబ్ అధికారులను అభినందించారు. అనంతరం పట్టుబ డిన మద్యాన్ని జెసిబితో ధ్వంసం చేశారు. ఎస్పీ వెంట ఎఎస్పీ ఎన్.విష్ణు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెం డెంట్ బి.సుబ్రహ్మణ్యం, పెనుకొండ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిఐ యుగంధర్, సెబ్ సిఐలు శ్రీనివాసులురెడ్డి, రాజశేఖర్‌గౌడ్, లలితాదేవి, ధీరజ్‌రెడ్డి, గురుప్రసాద్, విజయ్‌కుమార్, మోహన్‌రెడ్డి, పెనుకొండ ఎస్ఐ రాజేష్, పోలీసులు, సెబ్ పోలీసులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పెండింగ్ కేసులను పరిష్కరించాలి : ఎస్పీ

కొత్తచెరువు : పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ రత్న ఆదేశించారు. ఎస్పీ శుక్రవారం రాత్రి కొత్తచెరువు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రిసెప్షన్ కౌంటర్, రికార్డుల నిర్వ హణ, లాకప్ గదులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌లో ఉంచిన పట్టుబడిన వాహనాలు, వాటి కేసుల వివరాలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఆ సమయంలో స్టేషన్ వద్ద బాధితులు ఉండగా వారి వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రాత్రి వేళ పెట్రోలింగ్‌తో పాటు, గస్తీలు తిరిగి చోరీలను నియంత్రించాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు.

అడ్డదారుల్లో అధికారం కోసం పాకులాట

పార్టీ మారిన కౌన్సిలర్లతో రాజీనామా చేయించాలి - ఎమ్మెల్యే బాలకృష్ణపై వైసిపి నేతల ఫైర్

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

అడ్డదారుల్లో కౌన్సిలర్లను పార్టీలు మార్చే కార్యక్రమాన్ని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చేపట్టారని, ఆయనకు ధైర్యం ఉంటే పార్టీ మారిన వారితో రాజీనామా చేయించి ఎన్నికలకు వెళ్లాలని వైసిపి నాయకులు సవాల్ విసిరారు. శనివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. హిందూపురం పురపాలక సంఘం ఛైర్మన్ పదవి జనరల్ క్యాటగిరీలో ఉన్నప్పటికీ నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బిసిలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అంతటి ప్రాధాన్యత ఇచ్చి ఓ మహిళను ఛైర్‌పర్సన్‌ను చేస్తే ఆమె టిడిపిలో చేరి బిసిలకు నమ్మక ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాల్టీ అభివృద్ధి కోసం వచ్చే నిధులను దిగమింగడానికి ఛైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లను సంతలో పశువులను కొన్నట్లు బాలకృష్ణ కొన్నారని విమర్శించారు. బాలకృష్ణకు పార్టీలో చేరిన వారందరినీ రాజీనామాలు చేయించి, మళ్లీ వారిని గెలిపించుకునే దమ్ము ఉందని ప్రశ్నించారు. ప్రస్తుతం పార్టీ మారిన ఏ ఒక్క కౌన్సిలర్‌కు మళ్లీ కౌన్సిల్ ఎన్నికల్లో టికెట్ ఇవ్వరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు వేణురెడ్డి, నక్కలపల్లి శ్రీరామి రెడ్డి, బాలాజీ మనోహర్, అతవుల్లా, రాము, దాదు, డాక్టర్ బాషా పాల్గొన్నారు.

వైద్యుల నిరసనాగ్రహం

పశ్చిమబెంగాల్‌లో వైద్యురాలు మమితను అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా శనివారం నాడు వైద్యులు, వైద్య సిబ్బంది నిరసనాగ్రహం కొనసాగింది. ఐఎంఎ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రయివేటు వైద్యశాలలను మూసివేసి నిరసన తెలిపారు. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు, నర్సులు, సిబ్బంది విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఆస్పత్రుల వద్ద నిరసన ర్యాలీ చేశారు. జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి, హత్య చేసి నిందితున్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

హిందూపురంలో నిరసన తెలుపుతున్న వైద్యులు, వైద్య సిబ్బంది

వార్త 6లో

బిసిల ఏకైక పార్టీ టిడిపి : ఎంపి, ఎమ్మెల్యే



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

ప్రజాశక్తి-మడకశిర

రాష్ట్రంలో బిసిలకు అండగా ఉన్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఎంపి బికె.పార్థసారధి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో ఉన్న కొల్హాపూర్ అమ్మవారి ఆలయం లో శనివారం వాల్మీకి సంఘం, వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మోహన్ అధ్యక్షతన ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపి, ఎమ్మెల్యేలతోపాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు 14 నియోజకవర్గాల్లో బిసిలకు అవకాశం కల్పించి బిసిల పక్షపాతిగా మరోసారి చాటిచెపారన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించడానికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం హాజరైన ఎంపి, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఉమాదేవి దంపతులను వాల్మీకి సంఘం తరపున ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుండుమల రాధాకృష్ణ, కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, మాధవరాజు, ఓబులేసు, మద్దనకుంటప్ప, క్లాస్ వన్ కాంట్రాక్టర్ అక్కంపల్లి బాబు, బేగార్లపల్లి రవి, భక్తర్‌సాబ్, కౌన్సిలర్ ఉమాశంకర్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం కార్యకర్తకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-రొద్దం

మండల కేంద్రానికి చెందిన రొద్దం పాత ఎస్సీ కాలనీకి చెందిన టిడిపి దళిత కార్యకర్త, పార్టీ వీరాభిమాని వెంకటేష్ ఇంటి వద్ద కొన్ని రోజుల క్రితం కాలుజారి కింద పడ్డారు. వెన్నెముక విరగడంతో మంచానికే పరిమితం అయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మండల నాయకులు రొద్దం మాజీ సర్పంచి అశ్వర్థ నారాయణ, చిన్నపయ్య, నరసింహులు, మంజు, రామాంజి, తదితరులు ఆయనకు శనివారం నాడు ఆర్థిక సాయం అందజేశారు.

జూనియర్ డాక్టర్ అత్యాచార ఘటనపై పెల్లుబికిన నిరసనాగ్రహం

వైద్యులు, వైద్య విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బంది భారీ ర్యాలీలు, మానవహారాలు

'పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై సామూహిక అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఎ) పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన బంద్‌లో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా నిరసనాగ్రహం పెల్లుబికింది. వైద్యులు విధులను బహిష్కరిం చారు. అనంతరం వైద్యులు, వైద్య విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బంది ఎక్కడికక్కడ రోడ్లపైకి వచ్చి 'వి వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేస్తూ పెద్దఎత్తున ర్యాలీలు చేపట్టారు. దోషులను పట్టుకుని వెంటనే శిక్షించక పోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీరికి ఆర్‌ఎంపిలు మద్దతు తెలిపారు.'

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై సామూహిక అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ పట్టణం లో వైద్యులు, వైద్య సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సాగింది. వియ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐఎంఎ పట్టణ అధ్యక్షులు డాక్టర్ జయకుమార్, వాసుదేవరెడ్డి, కోశాధికారి మదన మోహన్, వైద్యులు సుబ్బారావు, నరసింహులు, డిప్యూటీ డిఎంహెచ్ఒ సెల్వియా సాల్మన్, నజీర్, వెంకటేష్, వైష్ణవి, సురేఖ, అనిల, వివేక్, విక్రమ్, అజయ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. వైద్యులు మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌పై సామూహిక అత్యాచారం, హత్యకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించాలన్నారు. వాస్తవాలు బయటకు రాకుండా కొన్ని దుష్ట శక్తులు కుట్ర పన్నాయని, కావున ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి సిబిఐ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వైద్య సిబ్బంది కోసం కేంద్రం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. ఇప్పటికీ దోషులను తేల్చకపోవడం అనుమానాలకు దారితీస్తోందన్నారు. అసలైన దోషులను పట్టుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే ఎపిఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి శివ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు. శివ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆ వైద్య విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఎఫ్ పట్టణ నాయకులు నవీన్, స్వామి, ప్రదీప్, ఉపేంద్ర, ఉదయ్ కుమార్, పవన్, తదితరులు పాల్గొన్నారు

హిందూపురం : ప్రాణాలు పోసే డాక్టర్ల ప్రాణాలను తీయవద్దని హిందూపురం ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుప్రవీణ్, సీనియర్ వైద్యులు ఈటి.రామ్మూర్తిలు కోరారు. పురం ఐఎంఎ ఆధ్వర్యంలో శనివారం నాడు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్ లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. వన్‌టౌన్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి స్టేషన్ అధికారికి వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోల్‌కతా ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించి సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో సమగ్ర దర్యాప్తు చేసి నిందుతులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ఉపాధ్యక్షులు డాక్టర్ చంద్ర కిరణ్ రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ సతీష్ రెడ్డి, మాజీ ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ వెంకటరమణ, సీనియర్ డాక్టర్లు డాక్టర్ లోకేంద్రనాథ్, డాక్టర్ షాన్వాజ్ ఖాన్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ రోహిల్ కుమార్, వైద్యులు, నర్సింగ్ స్టాప్ పాల్గొన్నారు.

ధర్మవరం పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టిన జూనియర్ డాక్టర్లు, వైద్యులు, సిబ్బంది

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో..

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో హిందూపురం పట్టణంలో పొట్టి శ్రీరాములు విగ్రహం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ కోల్‌కతా ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి వైద్య విద్యార్థిపై లైంగిక వేధింపులకు పాల్పడి అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఇటువంటి సంఘటనలు పున:రావతం కాకుండా చూడవలసిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పై ఉందని అన్నారు. వైద్య విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చంద్రశేఖర్, జై చంద్ర, రాజు, హుస్సేన్, హస్సేన్ పాల్గొన్నారు.

కొత్తచెరువు : వైద్యుల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాసుపత్రి వైద్యుడు అశ్వత్థనారాయణ కోరారు. జూనియర్ డాక్టర్ ఘటనను నిరసిస్తూ వైద్యులు, వైద్య సిబ్బంది, ఎఎన్‌ఎంలు, కాంట్రాక్టు ఉద్యోగులు ప్ల కార్డులు చేతపట్టి ఆసుపత్రి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. కేసును సిబిఐకి అప్పగించి, త్వరితగతిన ఛేదించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పవన్ కుమార్ డిమాండ్ చేశారు.

చిలమత్తూరు : వైద్య విద్యార్థిని అత్యాచారం, హత్యకు నిరసనగా తనకల్లులో వైద్య శాఖ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి మానవ హారంగా ఏర్పడ్డారు. వీరికి సిఐటియు అనుబంధ ఆర్‌ఎంపి సంఘం మద్దతు పలికింది. డాక్టర్ రామక్రిష్ణ మాట్లాడుతూ వైద్యులపై రోజు రోజుకూ దాడులు ఎక్కువైపోతున్నాయని, వైద్యుల కోసం ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు తేజశ్విని, వైద్య సిబ్బంది, ఆర్‌ఎంపిల సంఘం నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : వైద్య విద్యార్థిని అత్యాచారం, హత్యకు నిరసనగా కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కొక్కంటి క్రాస్‌లో వైద్యులు డాక్టర్ లోకేశ్వర్‌రెడ్డి, డాక్టర్ ధర్మరాజు ఆధ్వర్యంలో వైద్య ఉద్యోగులు ర్యాలీ, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వైద్య ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి కొక్కంటి క్రాస్‌లో మానహహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకూ ఓపి సేవలు నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మీదేవి, ముసల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, తనకల్లు మండలంలోని ఆర్‌ఎంపిలు, ల్యాబ్ టెక్నీషియన్లు, కొక్కంటి పిహెచ్‌సి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక పిహెచ్‌సి డాక్టర్ శ్వేత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, బస్టాండ్ కూడలిలో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక పివిఎస్ పాఠశాల కరస్పాండెంట్ నాయుడు ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. అలాగే జాతీయ రహదారిపై నాలుగు కూడళ్ల సర్కిల్‌లో మానవ హారంగా ఏర్పడ్డారు.

గోరంట్ల : జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. వైద్యులు డాక్టర్ వినోద్, డాక్టర్ రవితేజ మాట్లాడుతూ నిందితు లపై చర్యలు తీసుకోకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యులు మధుసూదన్‌రెడ్డి, ఫణిశంకర్, తేజేశ్వరగౌడ, కళ్యాణ్ కుమార్, భారతి, ప్రదీప్‌రెడ్డి, దుర్గాదీప్, గిరి, పావని, రామయ్య, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రి, పిహెచ్‌సి వైద్యులు, వైద్య సిబ్బంది సమ్మె చేపట్టారు. ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకూ ఆర్డీటీ ఆసుపత్రిలో వైద్య సేవలు నిలిపి వేశారు. అత్యవసర సేవలకు మినహాయింపు ఇచ్చారు. ఆర్డీటీ ఆసుపత్రి నుంచి బత్తలపల్లి పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వరకూ వైద్య సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. కూడలిలో మానవహారంగా నిల్చుకొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, వైద్యులు సుధీర్, హరీష్, దశరథరామ్, జ్యోతి, పిహెచ్‌సి వైద్యాధికారి గంగిరెడ్డి, సరస్వతి, రాజశేఖర్‌తో పాటు ఆర్డీటీ ఆసుపత్రి వైద్య సిబ్బంది, పిహెచ్‌సి సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కదిరి పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టిన వైద్యులు, సిబ్బంది

పెనుకొండ : బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో శాంతి ర్యాలీ చేపట్టారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ సర్కిల్, శ్రీకృష్ణదేవరాయ సర్కిల్, తెలుగు తల్లి సర్కిల్‌కు చేరుకుంది. కార్యక్రమములో బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు శివరామకృష్ణ, గౌరవాధ్యక్షులు, గౌరవ సలహాదారులు వెంకటేష్, బాబు, ప్రధాన కార్యదర్శి రవికుమార్, నరసింహులు, నరసింహులు, హనుమంతు నాయక్, కొల్లప్ప, ఉపాధ్యక్షులు నాగరాజు, ఈశ్వర్, పిహెచ్.హనుమంతు, శశి,ధను, యాండ్రస్, చిన్న అంజినప్ప పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పట్టణంలోని కదిరి ఏరియా ప్రభుత్వాసుపత్రి నుంచి నిరసనగా ర్యాలీ నిర్వహించి, డిప్యూటీ తహశీల్దార్ సునీతకు వినతి పత్రం సమర్పించారు. పలువురు డాక్టర్లు మాట్లాడుతూ బాధ్యులు ఎంతటి వారైనా చట్ట పరంగా కఠినంగా శిక్షించాలన్నారు. ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రమణయ్య, డాక్టర్ శంకరయ్య, డాక్టర్ రామకృష్ణయ్య, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ త్రిలోక్, డాక్టర్ భాస్కర్ నాయక్, డాక్టర్ విజయ్, డాక్టర్ బాబా ఫక్రుద్దీన్, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ రాఘవేంద్ర, ఏ.ఎన్ ఎం.లు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వారికి ఏపీ ఎన్జీవో కదిరి అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు, తెలుగు నాడు మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, సురేంద్రనాయక్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌ఎంపిల యూనియన్ నాయకులు, మద్దతు పలికారు.

కదిరి అర్బన్ : పట్టణంలోని స్పేస్ కళాశాల యాజమాన్యం ప్రశాంత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. స్పేస్ కళాశాల వద్ద నుంచి ర్యాలీ చేసి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిగి : స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ నవీన, డాక్టర్ సురేష్ కుమార్, డా జుబేర్, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ మౌనం పాటించారు. అనంతరం హంతకులకు కఠిన శిక్ష వేయాలని తహశీల్దార్ హసీనా సుల్తానా, ఎంపిడిఒ సరస్వతి, ఎస్ఐ సత్యనారాయణకు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వన్నప్ప, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె ఉమకు ఘన నివాళి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి భార్య, శ్రీబాలాజీ విద్యాసంస్థల కరెస్పాండెంట్ పల్లె ఉమ జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని శ్రీనివాస జూనియర్, డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రిన్సిపల్ ముసలిరెడ్డి ఆధ్వర్యంలో ఉమ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముసలిరెడ్డి మాట్లాడుతూ పల్లె ఉమ పేరిట ఇప్పటికీ పేద విద్యార్థుల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని గొట్లూరు వృద్ధ, అనాథాశ్రమంలో బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఆయనతో పాటు వృద్ధాశ్రమ నిర్వాహకులు ప్రపుల్ల చంద్ర ఉన్నారు.

బుక్కపట్నం : పల్లె ఉమ జయంతి సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉమ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అనంతరం అంగన్వాడీ సెంటర్‌లో పిల్లలకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మల్లిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగాధర్, మాజీ సర్పంచి సాకే యశోద, నాయకులు బాలు, సుబ్బారెడ్డి, లావణ్యగౌడ్, మీసాల మురళి, సయ్యద్ బాషా, జయరాం, మంజు, సుధీర్, రాయల్ రమణ, వాజిద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తచెరువు : పల్లె ఉమ జయంతి సందర్భంగా స్థానిక ధర్మవరం రోడ్డులోని టిడిపి కార్యాలయం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసి లక్ష్మీనారాయణ, నాయకులు గాజుల చంద్రమోహన్, ఆర్.నాగేంద్ర, బోయరాజు, నాగేంద్రప్రసాద్, ఆలకుంట శ్రీనివాసులు, పెద్దన్న, కేశప్ప పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : మండలంలోని కొండకమర్ల, ఒడిసి టిడిపి కార్యాలయాల్లో పల్లె ఉమ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో డాక్టర్ జాకీర్ హుస్సేన్, సర్పంచి రేణుకాబాయ్, టిడిపి నాయకులు రాజారెడ్డి, డీలర్ బాబు, నిజాం, రాయల్‌కుమార్, అంజనరెడ్డి, డీలర్ నాగేంద్ర, రమణారెడ్డి, గంగాద్రి, రామ్ శెట్టి, సుధాకర్, జరిపిటి అంజనప్ప, బోయపల్లి శివారెడ్డి, పీట్ల సుధాకర్, చాంద్‌బాషా, షబ్బీర్, సాంబశివరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, రాజగోపాలప్ప, రామాంజనేయులు, మస్తానమ్మ, అఖిల, నాగవేణి, సూరి, అశోక్‌యాదవ్, సుభాషిణి, ఎల్లప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : పల్లె ఉమ జయంతి సందర్భంగా టిడిపి నాయకులు పలుచోట్ల కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక హనుమాన్ సర్కిల్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రశాంతి గ్రామ్‌లో అన్నదాన చేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, రామ్ లక్ష్మణులు, నాయకులు కోనంకి గంగాధర్, జయప్రకాష్, క్రిష్టప్ప, బేకరీ నాయుడు పాల్గొన్నారు.

హిందూపురంలోని సప్తగిరి కళాశాలలో పల్లె ఉమ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

నల్లమాడ : పల్లె ఉమ జయంతి సందర్భంగా సత్తెమ్మ గుడి దగ్గర టిడిపి నాయకులు 450 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో బుట్టి నాగభూష నాయుడు, చిట్టిబాల రాజారెడ్డి, రవికుమార్, వడితే మహేందర్ నాయక్, డీలర్ శివప్రసాద్ రెడ్డి, రమణారెడ్డి, మైలే రామచంద్ర, పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్ : పట్టణంలోని శ్రీసత్య సాయి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో పల్లె ఉమ చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ పల్లె ఉమ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏటి స్వామి కేశవయ్య, వైస్ ప్రిన్సిపల్ అశోక్, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో ఉన్న పాఠశాలలో బాలాజీ విద్యాసంస్థల మాజీ కరస్పాండెంట్ ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పల్లె ఉమ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రేమలత, కష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు. సప్తగిరి కళాశాలలో శనివారం నాడు పల్లె ఉమ జయంతి వేడుకలను నిర్వహించారు. వద్ధాశ్రంలో అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంబిఎ, ఎంసిఎ ప్రిన్సిపల్ నారాయణ రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్ రెడ్డి, ఎఒ గంగి రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజునాథ్ పాల్గొన్నారు.

సాగునీటిపై అలసత్వం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జల్లాకు ప్రకృతి శాపంతోపాటు, పాలకుల శాపమూ వెంటాడుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాగుభూమి 23 లక్షల ఎకరాలకుపైగా ఉంటే అందులో రెండున్నర లక్షల ఎకరాల్లోపే నీటి వసతి ఉంది. పది శాతం భూమి కూడా సాగునీరు లేదు. దీంతో నిత్యం వర్షంపై ఆధారపడి పంటలు సాగు చేసుకునే పరిస్థితి. ఆ వర్షం కూడా ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు రాదో కూడా తెలియని స్థితిలో నిత్యం నష్టాలనే రైతాంగం ఎదురు చూస్తూ వస్తున్నారు. వచ్చే కొన్ని సాగునీటి వనరులపైనా అంతులేని నిర్లక్ష్యం కనిపిస్తోంది. దీంతో అవకాశమున్నా నీటిని సక్రమంగా వాడుకోలేకపోతున్నారు. ఈ ఏడాది ఇది స్పష్టంగానూ కనిపించింది. ఈ ఏడాది అటు తుంగభద్ర, ఇటు శ్రీశైలం రెండు జలాశయాలు జులై నెలలో నిండి గేట్లు కూడా ఎత్తారు. ఇదే సమయంలో అనంతపురం జిల్లాలో మాత్రం తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొనింది. ఈ మయంలో వృథాగా నదుల్లోకి పోతున్న నీటిని అయినా జిల్లాకు తెచ్చుకుని వాడుకునేందుకు వీల్లేకుండా పోయింది. శ్రీశైలం నిండిపోతున్నా హంద్రీనీవాకి నీరు ముందుగానే తీసుకోలేక పోయారు. హంద్రీనీవా కాలువలో రహదారి వేయడంతో అది క్లియర్ చేయడానికి చాలా సమయమే పట్టింది. అది క్లియర్ చేశాక ఇప్పుడు కొద్దికొద్దిగా నీళ్లు వస్తున్నాయి. వాస్తవానికి హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని 1800 క్యూసెక్కుల నుంచి ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని గత ప్రభుత్వం హామీనివ్వడమే కాకుండా టెండర్లు సైతం పిలిచింది. కాని పనులు ప్రారంభించలేదు. దీంతో ఇప్పటికీ 1800 క్యూసెక్కుల నీటినే తీసుకోవాల్సి వస్తోంది. ఆరు వేల క్యూసెక్కులకు పెంచిఉంటే రెండు రోజులకు ఒక టిఎంసి చొప్పున జిల్లాకు నీరొచ్చి ఉండేది. ఇప్పుడు ఒక టిఎంసి రావాలంటే కనీసం పది రోజులకుపైగా సమయం పడుతోంది. వృథాగా నదిలో పోతున్న సమయంలోనూ అదనంగా జిల్లాకు నీరు తీసుకోలేకపోతున్నారు. ఇక తుంగభద్ర పరిస్థితి వేరే చెప్పక్కర్లేదు. ఇది ఒక రకంగా జిల్లాకు జీవనాడి. అటుతాగు, సాగునీటి అవసరాలే తీర్చే ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు నిర్వహణ వైఫల్యంతో ఒక గేటు కొట్టుకుపోయి నీరంతా వృథా అయ్యింది. ఈ వృథా సమయంలలోనూ అదనంగా జిల్లాకు నీళ్లు తీసుకోలేకపోతున్నారు. ఎందుకంటే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి అదే విధంగా ఉంది. దీని ప్రవాహ సామర్థ్యం రెండు వేల క్యూసెక్కులు తీసుకుంటే కాలువ గట్లు తెగిపోయి ఎక్కడివక్కడ గండ్లు పడే అవకాశముండటంతో 1600 క్యూసెక్కులోపే నీరు తీసుకుంటున్నారు.

ఇలా ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు దెబ్బతీస్తుండగా, పాలకుల నిర్లక్ష్యం రైతాంగానికి తీరని నష్టం చేకూరుస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు సాగునీటి రంగంపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటారా లేదా అన్నది చూడాల్సి ఉంది. ఈ వారంలో వర్షాలు పడటం ఆనందించదగిన అంశం. జులై నెలలో తీవ్ర వర్షాభావ పరిస్థితులను చవిచూసిన జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ప్రధాన పంటల సాగుకు సమయం మించిపోయినప్పటికీ ఇతర పంటలకు, భూగర్భ జలాలకైనా ఇబ్బంది లేకుండా ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. ఈ వారంలో అనంతపురం జిల్లా ఎస్పీ కెవి.మురళీ కృష్ణ బదిలీ చర్చనీయాంశమైంది. ఆయన స్థానంలో కొత్త ఎస్పీ జగదీశ్‌ను నియమించారు. మురళీకృష్ణ బదిలీపై వచ్చి నెల తిరగకుండానే బదిలీ అవడం గమనార్హం.

ప్రహరీ తొలగించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అమరాపురం

మండలంలోని ఉదుగూరు గ్రామం వద్ద ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కనే మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి తన పొలానికి ఏర్పాటు చేసిన ప్రహరీని తక్షణమే తొలగించాలని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు అధికారులను ఆదేశించారు. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రజా ప్రతినిధులు ఇలా రోడ్డునే ఆక్రమించుకొని ప్రహరీ ఏర్పాటు చేయటం హాస్యాస్పదం అన్నారు. ప్రహరీని సాయంత్రం లోపు తొలగించకపోతే నేనే వచ్చి తొలగిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఆర్ఐ గిరియప్ప, గ్రామ కార్యదర్శి మహేష్, ఎఎస్ఐ రామాంజనేయులు, మండల కన్వీనర్ గణేష్, మాజీ జడ్పిటిసి నరసింహమూర్తి, శివరుద్రప్ప, జయ కుమార్, జయరామప్ప, మారుతిప్రసాద్, దాదాపీర్, కృష్ణమూర్తి, మంజు తారక్, రఘు, టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి నవీన్, శివకుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మీ నాయకుల ఆక్రమణలను స్వాధీనం చేసుకోండి : మాజీ ఎమ్మెల్యే

మడకశిర : ఎమ్మెల్యే ఎంఎస్.రాజు వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి ఉన్న బెంగళూరు–బళ్లారి 60 అడుగుల రోడ్డును ముగ్గురు టిడిపి నాయకులు ఆక్రమించుకున్నారు, ముందు దాన్ని స్వాధీనం చేసుకోవాలని హితవు పలికారు. తన సొంత పొలం నుంచి గ్రామానికి ప్రజలు వెళ్లేందుకు దారి కోసం 6 అడుగులు వదిలాను అని తెలిపారు. చట్టపరంగా రోడ్డు పరిధిలోకి వస్తే వదలడానికి సిద్ధమన్నారు. ఆయనతో పాటు వైసిపి మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, నాయకులు ఆటో తిప్పయ్య, రాజు, శివలింగప్ప, పేలుబండ ప్రసాద్ నారాయణప్ప, జెకె నరసింహమూర్తి ఉన్నారు.


ప్రహరీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు

జడ్పిటిసి శ్రీరాములు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రఘువీరారెడ్డి

జడ్పిటిసి కుటుంబ సభ్యులకు రఘువీరా పరామర్శ

పెనుకొండ : పెనుకొండ మండలం జడ్పిటిసి శ్రీరాములు మృతి చెందిన నేపథ్యంలో శనివారం సిడబ్ల్యుసి సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి గుట్టూరు వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అతడి భార్య సర్పంచి నాగరత్నమ్మను ఓదార్చి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీరాములు కాంగ్రెస్ పార్టీకి అనేక సేవలు అందించారన్నారు. 2005లో పెనుకొండ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారని గుర్తు చేశారు. అనంతరం వైసిపిలో చేరి సర్పంచి, జడ్పిటిసిగా రాజకీయ పదవులు చేపట్టారని తెలిపారు. అలాంటి వ్యక్తి మృతి బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రఘువీరాతో పాటు సిసి ఉపాధ్యక్షులు కెటి.శ్రీధర్, టిడిపి నాయకులు చిన్న వెంకటరాముడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమణా రెడ్డి, నరసింహులు, కొండల రాయుడు, గంగాధర్, ప్రకాష్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

చిలమత్తూరు : కోడూరు, చిలమత్తూరులో శనివారం పంచాయతీ కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టారు. 'భయపెడుతున్న డెంగీ' శీర్షికన శనివారం ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపిడిఒ నరేష్‌క్రిష్ణ, ఈఓఆర్‌డి ఈశ్వరయ్య ఆయా పంచాయతీలో తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆయా పంచాయతీ కార్యదర్శులు రామ్లానాయక్, నారాయణస్వామిలను ఆదేశించారు. దీంతో ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్మికులు పారిశుధ్య చర్యలను చేపట్టడంతో పాటు రోడ్లపై పేరుకుపోయిన బురదను, ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను జెసిబి సాయంతో తొలగించారు. అలాగే దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

కోడూరు, చిలమత్తూరులో పారిశుధ్య పనులు చేపట్టిన కార్మికులు

గురుకుల పాఠశాల ఎస్‌ఎంసి ఎన్నిక ఏకగ్రీవం

బత్తలపల్లి : స్థానిక మహాత్మజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసి) ఎన్నిక ఏకగ్రీవమైంది. ధర్మవరం ఎంఇఒలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ దేవరకొండ మాధవి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఆగస్టు 8వ తేదీ నిర్వహించాల్సిన ఎస్‌ఎంసి ఎన్నిక వాయిదా పడిన విషయం తెలిసిందే. అధికార టిడిపిలోని రెండు వర్గాలు ఛైర్మన్ పదవులకు పోటీపడ్డాయి. ఇరువర్గాల చర్చల అనంతరం డి.చెర్లోపల్లికి చెందిన శివశంకర్ ఛైర్మన్‌గా, గంటాపురానికి చెందిన లక్ష్మీదేవిని వైస్ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు సాఫీగా జరగడంతో అటు టిడిపి శ్రేణులు, ఇటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ముదిగుబ్బ సిఐ కృష్ణంరాజునాయక్, తాడిమర్రి, బత్తలపల్లి, పోతుకుంట, ఎస్ఐ లు నాగస్వామి, శ్రీనివాసులు, నరేంద్రతో పాటు ఎఎస్ఐలు, దాదాపు 30 మంది సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు. ఎంఇఒలు, ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, కమిటీ సభ్యులు పాఠశాల అభివృద్ధికి సహకారం అందించాలన్నారు.

ప్రభుత్వ సాయంతో కొనుగోలు చేసిన గొర్రెలు

సిఎం హామీ మేరకు ఆర్థికసాయం

మడకశిర : ఇటీవల నియోజకవర్గంలో పర్యటించిన సిఎం చంద్రబాబు మండలంలోని గుండుమల గ్రామంలో బి.రామన్న ఇంటిని సందర్శించి గొర్రెల కొనుగోలుకు ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ రూ. 60వేలు మంజూరు చేశారు. ఆ మొత్తంతో గొర్రెలు కొనుగోలు చేసి శనివారం రామన్నకు అందజేసినట్లు డిఆర్‌డిఎ పిడి కెఎన్.నరసయ్య తెలిపారు. అనంతరం పిడి ఓబుళమ్మ ఇంటిని సందర్శించారు. వారి వెంట ఏరియా కో ఆర్డినేటర్ ఎస్ఆర్.నాగరాజు, ఎపిఎం రవి, ఎలోసి సిసి లక్ష్మీకాంత్, సిసి క్లస్టర్ సిబ్బంది, సర్పంచి కరియన్న, చంద్రప్ప పాల్గొన్నారు.

21న జాబ్‌మేళా

కదిరి టౌన్ : పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన గిరిజన బాల బాలికల కోసం ఈ నెల 21వ తేదీ పట్టణంలోని ఎస్‌టిఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపి గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్, చెన్నై ప్రాంతాల్లో అమెజాన్ స్టోర్స్‌లో ప్యాకింగ్, స్కానింగ్, లోడింగ్, తదితర ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 79813 33346, 79938 64764 సంప్రదించాలన్నారు.

పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి సన్నిధిలో డీఎస్పీ

నల్లచెరువు : మండలంలోని పాలపాటి దిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామిని శనివారం కదిరి డీఎస్పీ శ్రీలత దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆంజనేయదాస్ డీఎస్పీకి స్వామి చిత్రపటం బహూకరించి శాలువాతో సన్మానించారు. డీఎస్పీ వెంట ఎస్ఐ కెఎం.లింగన్న ఉన్నారు.

ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్తున్న డీఎస్పీ

ఇళ్ల నిర్మాణాలను అడ్డుకుంటున్నారని ఫిర్యాదు

కొత్తచెరువు : వైసిపి ప్రభుత్వంలో స్థానిక ధర్మవరం రోడ్డులో 384 సర్వే నెంబర్‌లో 23 మందికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారన్నారు. ఆ స్థలాల్లో పునాదులు వేసుకుంటుంటే టిడిపి నాయకులు అడ్డుకుంటున్నారని లబ్ధిదారులు తహశీల్దార్ నాగరాజుకి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు అధికారులు, నాయకులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. స్పందించిన తహశీల్దార్ వీటిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆర్ఐ, విఆర్‌వోను ఆదేశించారు.

సోమందేపల్లి ఎస్ఐగా రమేష్ బాబు

సోమందేపల్లి : మండల నూతన ఎస్ఐగా శనివారం రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ విజయ్ కుమార్ బదిలీపై పుట్టపర్తికి వెళ్లారు. నల్లమాడలో పనిచేస్తున్న రమేష్‌బాబు ఇక్కడికి వచ్చారు. నూతన ఎస్ఐని మండలంలోని పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కేరళ వరద బాధితుల కోసం విరాళాలు సేకరిస్తున్న వ్యకాసం నాయకులు

కేరళ వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

రొద్దం : కేరళ వరద బాధితుల కోసం శనివారం వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో విరాళాలు సేకరించినట్లు వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న తెలిపారు. ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులు, దుకాణదారులు, ప్రజల నుంచి రూ. 7వేలు సేకరించామని, ఈ మొత్తాన్ని కేరళ సిఎం సహాయ నిధికి పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఫక్రుద్దీన్, వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు నార్సంపల్లి ఆంజనేయులు, కోగిర నారాయణ, భూ సాధన పోరాట కమిటీ సభ్యులు చిన్న ఆంజనేయులు, గ్రామ పంచాయతీ వర్కర్ తిప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

బాలయ్యను కలిసిన జయప్రకాష్

పుట్టపర్తి రూరల్ : టిడిపి కోసం కష్టపడి పని చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలిపారు. నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి జయప్రకాష్ శనివారం హిందూపురం టిడిపి కార్యాలయంలో బాలయ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బాలకృష్ణను కలిసిన జయప్రకాష్

వైబి హళ్లి ఉన్నత పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండలంలోని వైబి హళ్లి జడ్పీ హైస్కూల్‌ను శనివారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి సందర్శించారు. వారు పాఠశాల రికార్డులను పరిశీలించి కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో తాగునీటి సమస్యను తీర్చడానికి తక్షణం బోరు వేయాలని ఆదేశించారు. ప్రహరీతో పాటు మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట హెచ్‌ఎం గీతావాణి, ఎస్‌ఎంసి ఛైర్మన్ లక్ష్మీనారాయణ, సర్పంచి రామంజి, టిడిపి నాయకులు రవీంద్రారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, ఈడిగ శంకర్, ప్రసాద్, మురళి, సూర్యనారాయణ, హనుమంతరాయప్ప, హేమంత్, నరసింహమూర్తి ఉన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

గుడిబండ : మండలంలోని పిసి గిరి గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే రాజు, ఆయన సతీమణి ఉమాదేవి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, మంజునాథ్, దుర్గేష్, న్యాయవాది శివకుమార్, లక్ష్మీనరసప్ప, జయరాం, నన్నుమారెప్ప, ఎంపిటిసి శశిధర్ ఉన్నారు.

మడకశిర రూరల్ : మండలంలోని ఏఆర్.రొప్పంలో వెలసిన ఆంజనేయస్వామిని ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దర్శించుకున్నారు. అంతకముందు ఆలయ కమిటీ సభ్యులు వారిని సత్కరించారు.

పోతులనాగేపల్లి వంతెన నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం రూరల్ ప్రాంతంలోని పోతులనాగేపల్లి, కణంపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగుపై వంతెన నిర్మాణానికి కృషి చేస్తామని మంత్రి సత్యకుమార్ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ప్రాంతంలో వంతెన నిర్మిస్తే సమస్యకు పరిష్కారం ఉంటుందని రెండు గ్రామాల ప్రజలు వారికి వివరించారు. స్పందించిన వారు వాగును సందర్శించి గంగమ్మకు పూజలు చేశారు. మంత్రి ప్రతినిధులు హరీష్, మల్లికార్జున మాట్లాడుతూ ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వాగు ప్రవాహం తగ్గేంత వరకూ రెండు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తహశీల్దార్‌కు డీలర్ల సన్మానం

గుడిబండ : నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కరుణాకర్‌ను శనివారం మండల డీలర్ల సంఘం అధ్యక్షులు జనార్ధన్ ఆధ్వర్యంలో డీలర్లు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సన్మానించారు. మండలంలోని డీలర్లు ఆయనకు శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ రవినాయక్

తలుపుల : నూతన తహశీల్దార్(ఎఫ్‌ఎసి)గా రవినాయక్ శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. నంబులపూలకుంటలో డిప్యూటీ తహశీల్దార్‌గా పని చేస్తున్న ఈయన బదిలీపై తలుపులకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

సోమందేపల్లి : మండల వ్యాప్తంగా పంట సాగు చేసిన ప్రతి రైతు పంటతో సంబంధం లేకుండా వారంలోపు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి కవిత రాణి తెలిపారు. మండలం లోని గుడిపల్లి గ్రామంలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని శనివారం ఏవో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయానికి అందించే ప్రోత్సాహకాలు అందాలంటే సంబంధిత రైతు సేవా కేంద్రంలో సహాయ వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో గుడిపల్లి రైతు వెంకటరమణ, సచివాలయ వ్యవసాయ అధికారి బాలు, సచివాలయ సర్వేయర్ శివ పాల్గొన్నారు.

పెనుకొండలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణం పూర్తి చేస్తా : మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

సమాజంలో జర్నలిస్టుల సేవలు మరువలేనివి అని రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం మంత్రి పెనుకొండ నియోజకవర్గ జర్నలిస్టులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 'నేను కష్ట కాలం లో ఉన్నపుడు నా వెంట నడిచారు. ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇచ్చారు' అని కొనియా డారు. ఎప్పటికి నేను మీ మనిషినే, ఏకష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పెనుకొండలో అర్ధాంతరంగా నిలిచిపోయిన ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని, ఇళ్ల స్థలాలు ఇస్తామని తెలిపారు. జర్నలిస్టుల పిల్లలకు స్కూళ్లలో ఫీజులో రాయితీపై సిఎం చంద్రబాబుతో మాట్లాడుతానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సిద్దయ్య, రాంపురం సర్పంచి శ్రీనివాసులు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, బైలర్ అంజి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు బహుమతుల అందజేస్తున్న మంత్రి సవిత

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తల్లి కందికుంట నారాయణమ్మ స్మారకార్థం శ్రీ సత్య సాయి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కదిరి పట్టణంలోని ప్రభుత్వ ఎన్‌టిఎస్‌ఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో 46వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల హ్యాండ్ బాల్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో విజయనగరం అనంతపురంపై 18-9 గోల్స్‌తో, కర్నూలుపై 23-9 గోల్స్‌తో విజయం సాధించింది. విశాఖపట్నం జట్టు 14-1 గోల్స్‌తో కడపపై నెగ్గింది. నంద్యాల జట్టు 16-1 శ్రీకాకుళంపై, వెస్ట్ గోదావరి జట్టు 18-10 సత్యసాయి జిల్లా పై గెలుపొందాయి. బాలికల విభాగంలో శ్రీకాకుళం 1-0తో గుంటూరుపై గెలుపొందింది. శ్రీకాకుళం 8-1 గోల్స్ తో కర్నూలుపై, కర్నూలు 6-5తో అనంతపురంపై, శ్రీ సత్యసాయి జిల్లా జట్టు 5-3 నంద్యాలపై విజయం సాధించాయి. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు విజయకుమార్, కార్యదర్శి మహేష్, ఆంధ్రప్రదేశ్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వంశీ, వివిధ జిల్లాలకు చెందిన హ్యాండ్ బాల్ సంఘం ప్రతినిధులు చంద్రశేఖర రావు, లక్ష్మణ్ మహబూబ్ బాషా, రఫీ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ఫ్రెషర్స్‌డేలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని, అప్పుడే ఉజ్వల భవిష్యత్తు మీ సొంతం అవుతుందని కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బండి వేణుగోపాల్, కమిటీ సభ్యులు పళ్లెం వేణుగోపాల్, ముఖ్యఅతిథి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి, కొత్తచెరువు ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపల్ జ్యోతిలత తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ బాలికలు లక్ష్యంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. కళాశాల అధ్యాపకులు సునీత, వనిత, పెద్దన్న, తదితరులు ఫ్రెషర్స్ డే, చదువు ఉపయోగాలను తెలిపారు. విద్యార్థినులు నిర్వహించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాశాల నుంచి కొత్తచెరువుకు బదిలీపై వెళ్లిన జ్యోతిర్లతను ప్రిన్సిపల్, సిబ్బంది, ఛైర్మన్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు క్రీడా పరికరాల పంపిణీ

కొత్తచెరువు : సత్యసాయి భక్తురాలు ఫ్రాన్సిస్ కోతమ్మ సహకారంతో పిఆర్‌డిఎస్ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి శనివారం కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి, మండలాల్లోని 16 ఉన్నత, జడ్పా హైస్కూళ్లకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. కొత్తచెరువు జడ్పీ బాలుర, బాలికల పాఠశాలలు, తల మర్ల, బండ్లపల్లి, కేసాపురం, చనరాశిపల్లి జడ్పీ హైస్కూళ్లు, బుక్కపట్నం బాలికల, బాలుర పాఠశాల, కస్తూర్బా పాఠశాల, సిద్దరాపురం, పుట్టపర్తి మండలంలోని ఎనుములపల్లి, బీడీ పల్లి, జగరాశిపల్లి కస్తూర్బా పాఠశాల, జగరాజుపల్లి జడ్పీ హైస్కూల్, వెంగళమ్మ చెరువు పాఠశాలల హెచ్‌ఎంలు, పీడీలకు రూ. 15 వేల విలువ చేసే క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. సత్యసాయి భక్తురాలు ఆర్థికసాయంతో వీటిని అందించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వాణిబాయ్, వెంకటరమణ, సత్యసాయి భక్తురాలు ఎంజి లాల్ డిస్కౌంట్ స్టాలాండ్, పీడీలు ప్రభాకర్, రామకృష్ణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

బత్తలపల్లి : స్థానిక హెడ్ పోస్టాఫీసులో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, నింగేష్ తెలిపారు. స్థానిక పోస్టాఫీసులో శనివారం వారు సబ్ పోస్టుమాస్టర్ కమ్మన్న, ఎం. బుడ్డన్న, పూజితతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఆధార్ కేంద్రంలో బాల ఆధార్ ఉచితంగా నమోదు చేస్తారన్నారు. బయోమెట్రిక్ అప్‌డేట్, డెమోగ్రాఫిక్ నవీకరణ, చిరునామా మార్పు చేసుకోవచ్చు అన్నారు.

తొగటవీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల రాజీనామా

ధర్మవరం టౌన్ : పట్టణ తొగటవీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు ఆదినారాయణ, శంకర యుగంధర్ శనివారం తమ పదవులకు రాజీనామా చేశారు. పదవీ కాలం ముగియడంతో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. సేవా దృక్పథంతో పని చేయాలన్న ఆసక్తి ఉన్న తొగటవీర క్షత్రియ కులస్తులు ఎవరైనా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవి తీసుకోవచ్చని తెలిపారు. నూతన కమిటీకి మా సహాయ సహకారాలు కచ్చితంగా ఉంటాయని వారు తెలిపారు.

క్వారీ తనిఖీ

లేపాక్షి : మండలంలోని బయన్నపల్లి గ్రామం వద్ద ఉన్న క్వారీని శనివారం రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. ఆర్ఐ ప్రమీలమ్మ మాట్లాడుతూ క్వారీ నిర్వహణపై బయన్నపల్లి, మామిడిమాకులపల్లి గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేశామన్నారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి తహశీల్దార్ సౌజన్య లక్ష్మికి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఆర్ఐ వెంట గ్రామ రెవెన్యూ అధికారి గంగరత్నమ్మ, గ్రామస్తులు బాబు, నంజిరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, ఈశ్వర్, తదితరులు ఉన్నారు.

తహశీల్దార్ కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆర్‌డిఓ భాగ్యరేఖ సందర్శించి రికార్డులు, ఉద్యోగుల హాజరు, పెండింగ్ ఫైళ్లను పరిశీలించారు. అలాగే రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించి సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం నది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ఆమిదాలకుంట సమీపం లోని కాజ్‌వే వద్ద ధర్మవరం-కొత్తచెరువు ప్రధాన రహదారిలో రాకపోకలు నిలిచిపోవడంతో ఆ ప్రాంతాన్ని ఆర్‌డిఓ పరిశీలించారు. ఆమె వెం డిప్యూటీ తహశీల్దార్ స్వాతి ఉన్నారు.

మహిళా కండక్టర్ మృతి

కదిరి టౌన్ : కదిరి డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న పి.చెన్నలక్ష్మి(59) శుక్రవారం రాత్రి మృతి చెందారు. కొంతకాలంగా శ్వాస కోశ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్న ఆమె బెంగళూరులోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆమె కదిరి డిపోలో 1996లో కండక్టర్‌గా విధుల్లో చేరారు. ఆమెకు ఓ కుమార్తె ఉంది. ఆమె మృతిపై డిపో మేనేజర్ బి.మైనుద్దీన్ సంతాపం తెలిపి అంత్యక్రియల ఖర్చులకు రూ. 15 వేలు అందించారు. నివాళులర్పించిన వారిలో కదిరి డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోషియేషన్ నాయకులు ఎన్‌వి.రమణ, బైరె శెట్టి, విశ్రాంత ఉద్యోగులు కె.నరసింగరావు, జి.గోపాలకృష్ణ, హరిమోహన్ ఉన్నారు.

పశువులకు టీకాలపై అవగాహన

రొద్దం : పశువులకు టీకాలపై మండలంలోని ఎల్.తిమ్మాపురం గ్రామంలో శనివారం అవగాహన సదస్సు, ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా కార్యనిర్వాహక అధికారి డాక్టర్ టివి.సుధాకర్ మాట్లాడుతూ పశువులకు పుట్టే దూడల్లో 90 శాతం ఆడ దూడలే పుట్టేలా వీర్యాన్ని తయారు చేశారని తెలిపారు. భవిష్యత్తులో ఈ లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందన్నారు. రైతులు ఈ వీర్యాన్ని నూతన పద్ధతిలో వినియోగించేలా ప్రోత్సహించేందుకు ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహాయ సంచాలకులు డాక్టర్ శివ శంకర్ నాయక్, డాక్టర్ జాహ్నవి, పశువైద్యులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.